## 'అలయ్ బలయ్' విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపు
- సొసైటీ చైర్మన్లపై 'కవ్వంపల్లి' పెత్తనం మానుకోవాలని హితవు
- కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్

మానకొండూర్, అక్టోబర్ 18: తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి సాయిరాం గార్డెన్‌లో ఈనెల 20న నిర్వహించనున్న మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ 'అలయ్‌బలయ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. మానకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది దసరా తర్వాత బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'అలయ్‌బలయ్'ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులు హాజరవుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినా.. ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం విడ్డూరమన్నారు. రైతులు చేతికొచ్చిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడమే కాకుండా.. సొసైటీ చైర్మన్లపై పెత్తనం చెలాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్నిరకాల వడ్లకు క్వింటాల్‌కి ₹500 బోనస్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఆయా మండలాల బీఆర్ఎస్ అధ్యక్షుడు తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, గంట మహిపాల్, రావుల రమేశ్, మహిపాల్‌రెడ్డి, గంప వెంకన్న, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రామంచ గోపాల్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, మర్రి కొండయ్య, బొయిని కొమురయ్య, బోడ రాజశేఖర్ పాల్గొన్నారు.

## వ్యవసాయ మంత్రి ఉన్నట్టా.. లేనట్టా?

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



బూరుగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 18 : ''వరి కోతలు మొదలై 20 రోజులు గడుస్తున్నది.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వస్తున్నది. అయినా, కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనకుండా కాంగ్రెస్ ప్రాభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోంది. అసలు రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నట్టా ? లేనట్టా ? అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని బూరుగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మాజీ ఎంపీటీసీ దూలం శంకర్‌గౌడ్, నాయకులు గడ్డం స్వామి పాల్గొన్నారు.

# ముంచుతున్న చిత్తుబొత్తు!



- జగిత్యాల జిల్లాలో జోరుగా ఆట
- గుట్టబోర్లు, అటవీప్రాంతాలే అడ్డాలు
- కార్లు, జీపులు పోలేని చోటే కేంద్రాలు
- ఫోన్‌పే, గూగుల్‌పే చేస్తే డబ్బులు ఇచ్చే సౌకర్యం
- వారంలో నాలుగైదు రోజులు జూదం
- రోజుకు ₹30 లక్షల నుంచి ₹40 లక్షల దందా!

జగిత్యాల జిల్లాలో చిత్తుబొత్తు జోరుగా సాగుతున్నది. ముఖ్యంగా ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో గల అటవీప్రాంతాలు, గుట్టబోర్లు కేంద్రాలుగా నడుస్తున్నది. కార్లు, జీపులు, భారీ వాహనాలు పోవడానికి వీలు లేని కేవలం రెండు వైపులా తోవ ఉన్న గుట్టబోరు, అటవీ ప్రాంతాన్ని జూదరులు ఎంచుకుంటున్నారు. సమాచారం చేరవేత కోసం ఆట కేంద్రానికి మూడంచెల్లో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలీసులు, ఇతరులు వెళ్లేందుకు ప్రయత్నం చేస్తే నిర్వాహకులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం చేరేలా, ఆ తర్వాత మరో మార్గంలో పారిపోయేలా ముందే ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఆట స్థావరాన్ని కూడా మార్చేస్తూ, నిత్యం రూ.లక్షల్లో జూదం ఆడుతున్నారు.

జగిత్యాల, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ)/జగిత్యాల కలెక్టరేట్ : చిత్తుబొత్తు కేంద్రాల్లో రోజుకు ₹30 లక్షల నుంచి ₹40 లక్షల వరకు జూదం జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఆటకు అలవాటు పడిన జూదరులకు నిర్వాహకులు మధ్యాహ్నం ఆట జరిగే స్థలం వివరాలను ఫోన్‌ద్వారా చేరవేస్తున్నారు. ఆడేవారు మధ్యాహ్నం మూడు, నాలుగు గంటల ప్రాంతంలో చేరుకుంటున్నారు. వీరేశం చెప్పిన ప్రకారం చూస్తే రోజుకు 70 నుంచి 80 మంది జూదరులు ఆటకు హాజరవుతున్నారు. చిత్తుబొత్తులో పాల్గొనే వారు ఆటకు ₹100 చొప్పున నిర్వాహకులకు ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక వ్యక్తి రూపాయి నాణెం ఎగురవేసి ఎడమ అరచేతిలో మూస్తాడు. బొమ్మ (చిత్తు) చెప్పేవారు.. బొరుసు(బొత్తు) చెప్పేవారు తమ బెట్టింగ్ మొత్తాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఇద్దరు వ్యక్తులకు అందజేస్తారు. ఇలా ₹వెయ్యి నుంచి ₹5 వేల వరకు డబ్బులు పందెం కాస్తున్నారు. కొద్దిసేపటి తదుపరి నాణెంను మూసిన వ్యక్తి దానిపై నుంచి చేతిని తొలగిస్తాడు. బొమ్మ పడితే.. బొరుసుపై పందెం కాసిన వారు పెట్టిన డబ్బులన్నింటినీ బొమ్మపై పందెం కాసిన వారి లెక్క ప్రకారం వారికి అందజేస్తారు. ఇలా ఆట మూడు నుంచి నాలుగు గంటల పాటు కొనసాగిస్తున్నారు. సాయంత్రం ఆరున్నర ఏడు గంటల ప్రాంతంలో ఆట ఆపేస్తున్నారు.

వీరేశం (పేరు మార్చబడింది) 50 ఏండ్ల వయసున్న వ్యాపారి. మల్యాల మండలానికి చెందిన ఆయన దాదాపు పాతికేండ్ల క్రితమే వ్యాపారం కోసం జగిత్యాల పట్టణానికి మకాం మార్చాడు. అయితే, మొదటి నుంచి వీరేశం పేకాట ఆడేవాడు. 15 ఏండ్ల క్రితం మల్యాల మండల పరిధిలోని ఓ నాయకుడు అక్కడి అటవీప్రాంతంలో నిత్యం నిర్వహించే పేకాట కేంద్రాలకు వెళ్లి ఆడేవాడు. అయితే, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పేకాట, జూదంపై ఉక్కుపాదం మోపడంతో మల్యాల అటవీ ప్రాంతాల్లోని పేకాట స్థావరాలకు సదరు నాయకుడు ముగింపు పలికాడు. దాదాపు ఏడాది క్రితం ప్రభుత్వం మారడంతో మళ్లీ జూదం మొదలైంది. అయితే, గతంలో పేకాటను ఎంచుకున్న నిర్వాహకులు ఈసారి కొత్తగా చిత్తుబొత్తు ఆడిస్తున్నాడు. ఈ క్రమంలోనే జగిత్యాల జిల్లా, ప్రధానంగా ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని అటవీప్రాంతంలో గుట్టుగా సాగుతున్న ఈ ఆట గురించి వీరేశం తెలుసుకున్నాడు. దసరా పూట పెగడపల్లి మండల శివారులో రహస్యంగా ఆట నిర్వహిస్తున్న స్థావరానికి వెళ్లాడు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆడి, ₹50 వేలు పోగొట్టుకొని ఇంటికి చేరుకున్నాడు. పెద్దమొత్తంలో డబ్బులు పోవడంతో పండుగపూట నిరాశలో మునిగిపోయాడు. దగ్గరిమిత్రులతో చెప్పుకొని లబోదిబోమన్నాడు.

### పది శాతం కమీషన్‌తో నగదు

చిత్తుబొత్తు ఆట నిర్వాహకులు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఫోన్‌పే, గూగుల్‌పేకు అవకాశం లేదని చెబుతున్నారు. ఆటలో పాల్గొనే వారు కచ్చితంగా నగదు మాత్రమే పెట్టాలి. లేదంటే నగదు తీసుకురాని వారి కోసం కమీషన్‌పై నగదు ఇచ్చే సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. దీనికోసం ₹10 లక్షల నుంచి ₹15 లక్షల నగదుతో ఆట స్థావరం వద్ద నిర్వాహకులు తమ మనుషులను ఉంచుతున్నారు. ₹50 వేలు గూగుల్‌పే చేసిన వ్యక్తికి ₹45 వేల నగదు అందజేసి, ₹5 వేలు కమీషన్‌గా వసూలు చేస్తున్నారు. ఆడేవారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఆట సమాచారం బయటకు పొక్కకుండా చూసుకుంటున్నారు.

### తాగుబోతులకు నో ఎంట్రీ

చిత్తుబొత్తు నిర్వాహకులు ఆట విషయం బయటకు పొక్కకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. మద్యం తాగిన వారు డబ్బులు పోగొట్టుకుంటే ఆ మత్తులో వీరంగం వేసే అవకాశమున్నది. ఇది ఆటకు అంతరాయం కలిగిస్తుందని, విషయం బయటికి వస్తుందనే కారణంతో మద్యం తాగిన వారిని ఏమాత్రం అనుమతించడం లేదు.

### నిర్వాహకులకు పదిశాతం లాభం

చిత్తుబొత్తు ఆటలో నిర్వాహకులు పెద్ద మొత్తంలో లాభాలు పొందుతున్నట్లు తెలుస్తున్నది. గూగుల్‌పే, ఫోన్‌పే కమీషన్‌తోపాటు చిత్తుబొత్తు వేసే వ్యక్తి కోసం ఆటలో పాల్గొన్న వ్యక్తి నుంచి ₹వంద వసూలు చేస్తున్నారు. అలాగే, ఒకసారి నాణెంను పైకి వేసి, తెరిస్తే ఒక్క ఆట అవుతుంది. ఈ ఆటలో పాల్గొన్నవారు పెట్టిన మొత్తంలో 10 శాతం నిర్వాహకులు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. అంటే ఒక్క ఆటకు ₹లక్ష బెట్టింగ్ జరిగితే అందులో నుంచి ₹పది వేలు నిర్వాహకులు తీసుకుని, 90 శాతం నగదును బెట్టింగ్ కాసి గెలిచిన వ్యక్తులకు పంపిణీ చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారం రోజూ ₹30 లక్షల నుంచి ₹40 లక్షల వరకు ఆట సాగితే ₹3 లక్షల నుంచి ₹4 లక్షలు నిర్వాహకులు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. అయితే, రెండు నెలల నుంచి చిత్తుబొత్తు జూదం జోరుగా నడుస్తున్నా, ఇంత వరకు బయటకు పొక్కకపోవడం, పోలీసుల దృష్టి పడకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

## డిజిటల్ క్రాప్ సర్వే చేయలేం

- నల్ల బ్యాడ్జీలు ధరించి ఏఈవోల నిరసన



పెద్దపల్లి జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు

పెద్దపల్లి, అక్టోబర్18: డిజిటల్ క్రాప్ సర్వే చేయలేమని ఏఈవోలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు నల్లబ్యాడ్జీలు ధరించి పెదపల్లి కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ మీద అధిక పనిభారం మోపుతున్నదని.. తాము డిజిటల్ సర్వే చేయలేమని డీఏవో దోమ ఆదిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఏఈవోలు మాట్లాడుతూ, ఇప్పటికే వ్యవసాయశాఖలోని 49రకాల పనులు చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వే చేయడం అసాధ్యమని స్పష్టంచేశారు. ఈ సర్వే చేయడానికి సహాయకులను నియమించాలని, లేకుంటే మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఏ విధంగా సర్వే చేస్తున్నారో.. ఇక్కడ కూడా అలానే చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఈఏవోలు పాల్గొన్నారు.

# సీసీఐ జాడేది?

- మార్కెట్లకు వస్తున్న పత్తి
- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- ప్రైవేట్ వ్యాపారులదే హవా
- తేమ పేరిట మద్దతు ధరకు మంగళం
- ₹7 వేలు దాటని క్వింటాల్ ధర
- అకాల వర్షాలతో రైతుల్లో మరింత ఆందోళన



కరీంనగర్ శివారులోని ఓ మిల్లులో పత్తి దింపుతున్న కూలీలు



పత్తిని దింపుతున్న రైతులు

దసరా ముందు నుంచే మార్కెట్లకు పత్తి వస్తున్నా సీసీఐ మాత్రం ఇంకా రంగంలోకి దిగలేదు. దీపావళి తర్వాతగానీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పుడు తేమ శాతం అధికంగా ఉన్న పత్తి వస్తుందని, ఎఫ్ఏక్యూ ప్రకారం తేమ ఉంటే తప్ప కొనుగోళ్లు చేయలేమని అధికారులు చేతులెత్తేయగా, రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో తేమను సాకుగా చూపి తక్కువకే కొంటుండగా కనీస మద్దతు ధర దక్కకుండా పోతున్నది. అసలే పుండు మీద కారం చల్లినట్టు అకాల వర్షాలతో మరింత ఆందోళన వ్యక్తమవుతున్నది.

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : పత్తి కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నాయి. దీపావళి తర్వాతనే సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించే అవకాశాలున్నాయి. కరీంనగర్ జిల్లాలో 9 కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు జరపాలని సీసీఐ నిర్ణయించింది. జిల్లాలో 42,730 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఎకరాకు 9 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చినా 3,84,570 క్వింటాళ్లు అంటే 38.45 వేల మెట్రిక్ టన్నులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అందులో మార్కెట్‌కు సుమారు 32 వేల టన్నులు రావచ్చని భావిస్తున్నారు. దసరాకు ముందే మొదటిసారి పత్తిని ఏరిన రైతులు ఇప్పుడిప్పుడే విక్రయాలకు తీసుకొస్తున్నారు. అయితే, సీసీఐ కేంద్రాలు తెరువకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా తేమ అధికంగా ఉందని తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ₹7,521 దక్కకుండా పోతున్నది. జమ్మికుంటలాంటి పెద్ద మార్కెట్‌కు దసరా ముందు నుంచే కొత్త పత్తి వస్తున్నది. రెండు రోజులుగా చూస్తే పత్తి ధర ఎమ్మెస్పీ కంటే చాలా తక్కువ పలుకుతున్నది. మోడల్ ధర క్వింటాల్‌కు ₹6,600, గరిష్ఠ ధర ₹6,950, కనిష్ఠ ధర ₹6 వేలకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గురువారం కరీంనగర్ మండలం ఎలబోతారంలోని శక్తి మురుగన్ ఇండస్ట్రీస్‌లో కాస్త మెరుగ్గా ₹7 వేలకు క్వింటాలు చొప్పున కొన్ని క్వింటాళ్లు కొనుగోలు చేశారు. కరీంనగర్ మార్కెట్‌లో కూడా దారుణంగా పత్తి ధరలు తగ్గించి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,500 క్వింటాళ్ల వరకు కొనుగోళ్లు జరిగినట్టు అధికారులు చెబుతున్నా అంతకంటే ఎక్కువే కొన్నట్టు తెలుస్తున్నది.

### కఠినంగా సీసీఐ నిబంధనలు

సీసీఐ నిబంధనలు చూస్తే కఠినంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో పత్తిని సీసీఐ ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేసే అవకాశం లేదు. 8 శాతం తేమ ఉండి పింజ 30.5 నుంచి 29.5 ఎంఎం ఉంటేనే కనీస మద్దతు ధర క్వింటాల్‌కు ₹7,521 చెల్లిస్తుంది. పింజ ఎంఎం తగ్గినా ధర తగ్గిస్తుంది. ఇదే 8 శాతం తేమ ఉండి 29.49 నుంచి 29.01 ఎంఎం ఉన్న పత్తికి ₹7,471 ఇస్తుంది. ఇదే తేమ శాతంలో 28.5 నుంచి 27.5 ఎంఎం పింజకు ₹7,421 మాత్రమే చెల్లిస్తుంది. అంతే ఎంఎం తగ్గిన కొద్దీ ₹50 తగ్గించేస్తుంది. అందులో 12 శాతం తేమ ఉన్న పత్తికి 28.5 నుంచి 27.5 ఎంఎం ఉన్న పింజకు ₹7,124 చెల్లిస్తుంది. ఇలా తేమ శాతాన్ని, పత్తి పింజ వెడల్పును లెక్కించిగాని సీసీఐ కనీస మద్దతు ధర చెల్లించే పరిస్థితి కనిపించడం లేదు. తేమ ఒక శాతం పెరిగితే ఎమ్మెస్పీలో ఒక శాతం అంటే ₹75.21 తగ్గిస్తుంది. ఈ నేపథ్యంలో సీసీఐ కేంద్రాల్లోనూ కనీస మద్దతు ధర లభించే పరిస్థితి కనిపించడం లేదు. అకాల వర్షాలతో పత్తిలో తేమ శాతం అధికంగా ఉంటే ప్రైవేట్ వ్యాపారులు సైతం ధర తగ్గిస్తారనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది.

### దీపావళి తర్వాతే సీసీఐ కొనుగోళ్లు!

సీసీఐ ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తినే కొనుగోలు చేస్తుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తేమ 25 నుంచి 30 శాతం వస్తున్నది. ఈ నేపథ్యంలో తాము ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయలేమని ఇటీవల జరిగిన సమావేశంలో సీసీఐ అధికారులు తేల్చి చెప్పారు. వర్షాలు తగ్గితే దీపావళి తర్వాతనే తాము కొనుగోళ్లు ప్రారంభిస్తామని జిల్లా ఉన్నతాధికారుల ముందే సీసీఐ అధికారులు స్పష్టం చేసినట్లు తెలుస్తున్నది. కరీంనగర్ జిల్లాలో మొత్తం తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఎలబోతారంలోని శక్తి మురుగన్ ఇండస్ట్రీస్, మల్కాపూర్ పరిధిలోని మల్లారెడ్డి కాటన్ ఇండస్ట్రీస్, రేణికుంటలోని రామినేని ఆగ్రో ఇండస్ట్రీస్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో వైభవ్ కాటన్ కార్పొరేషన్ అండ్/ఆదిత్య కాటన్ అండ్ ఆయిల్ ఆగ్రోటెక్ ఇండస్ట్రీస్, మురుగన్ ఇండస్ట్రీస్ అండ్ కాటన్ జిన్నింగ్ ప్రెస్సింగ్ అండ్ ఆయిల్ మిల్, రాజశ్రీ కాటన్ ఇండస్ట్రీస్, సీతారామ కాటన్ ఇండస్ట్రీస్‌లో, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ పరిధిలో రుక్మాపూర్‌లోని శివ శివాని కాటన్ ఇండస్ట్రీస్, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్ పరిధిలో వెలిచాలలోని కావేరి జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పత్తి కొనుగోళ్లు జరపాలని నిర్ణయించింది.


### వానలొస్తున్నయని భయమైతంది



వానలొస్తన్నయని భయమైతంది. ఫస్ట్ ఏరిన పత్తికి మంచి ధర వస్తందని ఇక్కడికి వచ్చిన. కొంచెం మంచిగనే వచ్చింది. నేను మొత్తం ఏడు క్వింటాళ్లు తెచ్చిన. ₹6,700 చొప్పున తీసుకున్నరు. మా పత్తి మంచిగున్నది. సీసీఐకి అమ్మితే ఇంకొంచెం ఎక్కువ పైసలు వచ్చేటియి. ఇప్పుడు సీసీఐ కేంద్రాలు ఎక్కడున్నయి? పైసలు సుతం అవుసరం ఉండే. అందుకే అమ్మిన.

- బోడపల్లి పుష్పలత, హిమ్మత్‌నగర్ (గంగాధర)

### సీసీఐల మద్దతు ధర వచ్చేటిది



నా పత్తి చాన బాగున్నది. ఇక్కడి సేట్లు సుతం మరీ అన్యాయం చెయ్యకుంట మంచి ధర ఇచ్చిన్రు. రెండు క్వింటాళ్లు తెస్తే ఏడు వేల చొప్పున కట్టిచ్చిన్రు. సీసీఐల అయితే మద్దతు ధర వచ్చేటిది. ఏంజేసుడు? వాళ్లు ఇప్పుడే కేంద్రాలు పెట్టరాయె. దీపావళి ఎల్లేదాక మా ఆగచ్చు. వానలు ఎట్లనో ఉన్నయి. అయింత ధర రాదని ఇప్పుడే అమ్ముకున్న. చేన్ల ఉన్న పత్తిని చూసి భయమైతంది. గిట్లనే వానలువడితే పత్తంతా దెబ్బతింటది.

- అచ్చ రమేశ్, నగునూర్, (కరీంనగర్ రూరల్)

## నాడు రిజిస్ట్రార్.. నేడు వీసీ

- ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్
- గతంలో రిజిస్ట్రార్‌గా తనదైన ముద్ర
- నేడు వీసీగా బాధ్యతల స్వీకరణ



కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18 : శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం విశ్రాంత సీనియర్ ప్రొఫెసర్, ఎస్‌యూలో నాడు రిజిస్ట్రార్‌గా పనిచేసిన యూ ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ శుక్రవారం గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట. 28ఏళ్ల బోధన అనుభవంతోపాటు 20 ఏళ్ల పరిశోధన అనుభవంతో ఉమేశ్‌కుమార్ మంచి గుర్తింపు పొందారు. ఈ క్రమంలో శనివారం శాతవాహన యూనివర్సిటీలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తున్నది.

### గతంలో చేపట్టిన బాధ్యతలివే..

ఉమేశ్ కుమార్ 2015లో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ తర్వాత రిజిస్ట్రార్‌గా నల్గొండ ఎంజీ యూనివర్సిటీలో మూడేళ్లు, శాతవాహనలో రెండేళ్లు విధులు నిర్వర్తించారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ఆయన రాసిన 36 కథనాలు ప్రచురితమయ్యాయి. ఆయన మార్గదర్శకత్వంలో తొమ్మిది మంది పరిశోధకులు పీహెచ్‌డీ పొందారు. మరో విద్యార్థి పీహెచ్‌డీ కోసం పనిచేస్తున్నారు. కాగా, ఉమేశ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి ఈసీ సభ్యుడిగా, హర్యానాలోని భివానీలోని దరీ బన్సీలాల్ విశ్వవిద్యాలయానికి గవర్నర్ నామినీగా బాధ్యతలు నిర్వర్తించారు. పాలమూరు యూనివర్సిటీలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా సైతం పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లో వివిధ అడ్మినిస్ట్రేటివ్, అకాడమిక్ పదవులు చేపట్టారు. బిక్నూర్ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, స్టూడెంట్స్ అఫైర్స్ ఉస్మానియా యూనివర్సిటీ, జాయింట్ డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఉస్మానియా యూనివర్సిటీ, చైర్మన్, బీవోఎస్, హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందారు.

### శాతవాహనలో తనదైన ముద్ర

ఉమేశ్‌కుమార్ 2017 నుంచి 2019 వరకు శాతవాహన యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కాలంలో తనదైన ముద్ర వేసుకున్నారు. యూనివర్సిటీ వీసీ చిరంజీవులు, ఆయన రిజిస్ట్రార్‌గా ఉన్న కాలంలో శాతవాహన స్నాతకోత్సవాన్ని నిర్వహించిన ఘనత దక్కింది. యూనివర్సిటీలో సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు, సెక్యూరిటీ, సుందరీకరణ పనులు చేపట్టారు. అలాగే, అధికారులు, సిబ్బంది విషయంలో ఆయన సింహస్వప్నం అని చెప్పవచ్చు.

## గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జి దుర్మార్గం

- కాంగ్రెస్‌ను నమ్మి కోచింగ్ తీసుకుంటే కొట్టిస్తారా?
- ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తున్నది
- పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందే
- లేకుంటే నిరుద్యోగులకు అండగా నేనుంటా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ విద్యానగర్, అక్టోబర్ 18 : మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వం నిరుద్యోగులపై రాక్షసంగా వ్యవహరిస్తున్నదని, గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జి దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. గ్రూప్ 1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందేనని, లేనిపక్షంలో సామాన్య కార్యకర్తగా నిరుద్యోగుల వద్దకు వెళ్లి అండగా ఉంటానని స్పష్టం చేశారు. నిరుద్యోగులు తలుచుకుంటే ప్రభుత్వాలే తారుమారవుతాయని, సమస్య జఠిలం కాకుండా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే సూచించారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను నమ్మి లక్షలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటే ఇలా గుంజుకొచ్చి మరీ పోలీసులతో కొట్టిస్తారా? నిరుద్యోగులు చేసిన తప్పేందని ప్రశ్నించారు. నిరుద్యోగుల పాలిట శాపంలా మారే జీవో 29ను ఇకనైనా ఉపసంహరించుకోవాలని, గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు అశోక్‌నగర్ వెళ్లి నిరుద్యోగుల ఆందోళనకు మద్దతు ఇస్తానన్నారు. తనకు నిరుద్యోగుల జీవితాలే ముఖ్యమని, కేంద్ర మంత్రి పదవి సంగతి తరువాత అన్నారు. గ్రూప్-1 అభ్యర్థులు చేస్తున్న ఆందోళన న్యాయమైందని, ఈ ఆందోళనతో కాంగ్రెస్ ప్రభుత్వం మనుగడే ప్రశ్నార్థకంగా మారేలా చేసుకోవద్దని హితవుపలికారు. గ్రూప్-1 అభ్యర్థుల గొడవ, మూసీ ప్రక్షాళన గొడవ ఉధృతమై ప్రభుత్వం పడిపోవాలని కొందరు కాంగ్రెస్ నేతలే కోరుకుంటున్నారని, సీఎం సీటు కోసం గోతికాడ నక్కలా ఎదురు చూస్తున్నారని విమర్శించారు. మూసీపై సీఎం రేవంత్‌రెడ్డి రోజుకోమాట మారుస్తూ గజినీలా మారుతున్నారని ఎద్దేవా చేశారు. మూసీ పేరుతో రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి బీజేపీ వ్యతిరేకమన్నారు. మూసీ పేరుతో 11 వేల ఇండ్లను కూల్చడానికి వ్యతిరేకమని, కాంగ్రెస్‌కు చేతనైతే 11 వేల కుటుంబాలకు ఇండ్లు కేటాయించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబాల జీవనోపాధికి ఢోకా లేకుండా చేసిన తరువాతే మూసీ ప్రక్షాళనకు పూనుకోవాలని సూచించారు. హైడ్రా పేరుతో ఇండ్లను కూల్చివేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ప్రభుత్వానికి దమ్ముంటే అక్రమ లేఅవుట్లను రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు, బాధ్యులను జైలుకు పంపాలన్నారు. సమావేశంలో బీజేపీ నేత చెన్నమనేని వికాస్‌రావు, మాజీ మేయర్ డీ శంకర్, నాయకులు గంటల రమణారెడ్డి, కొలగాని శ్రీనివాస్, జితేందర్ పాల్గొన్నారు.